జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 15-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 369 పేజీలు: 4 వెల: రూ.7





# సర్వజన.. అవస్థల ఆసుపత్రి



**శ్రీకాకుళం, జూన్ 14 (వార్త):** పేదల ఆసుపత్రి రిమ్స్‌లోని ప్రత్యేక వార్డులు, లక్షలాది రూపాయలు విలువ చేసే వైద్య పరీకరాలు, మందులు ఉన్న గదులతో పాటు వైద్యులు ఓపీ అందించే విభాగాల్లో పలు ఏసీలు పనిచేయడం లేదు. ఒకవైపు ఉక్కపోత, మరోవైపు వేడితో రోగులతో పాటు వైద్యులు సతమతమవుతునాష్ట్రురు. ఆసుపత్రిలో అత్యవసర విభాగం, ఐసీయూ, గైనకాలజీ, పీడియాట్రిక్ వార్డుల్లో ఏసీలు, ఫ్యాన్లు పని చేయకపోవడంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. జూన్ 2025 నాటికి ఆసుపత్రిలో ఉన్న 190 ఏసీలలో సుమారు 68 యూనిట్లు పని చేయడం లేదు. వీటిలో 130 ఏసీలు అయిదేళ్లకు పైబడినవి, అంటే అవి ఇప్పటికే భద్రతా పరంగా హై రిస్క్ గ్రూపులోకి చేరినవే. అలాగే, 129.5 టన్నుల శీతలీకరణ సామర్థ్యం నష్టమవుతోంది, అంటే సగానికిపైగా ఏసీలు పని చేయకపోవడం వల్ల రోగులే కాదు, వైద్య పరికరాలకూ ప్రమాదం ఏర్పడుతోంది. ఆపరేషన్ తర్వాత గాయాలపై వేసే కట్లు, ప్రసవాల తర్వాత కుట్లు చెమటతో తడిసి, దురద వేస్తున్నాయి. దీంతో రోగులు వాటిని గిల్లుతున్నారు. ఫలితంగా ఇన్ఫెక్షన్లు పెరిగి, మోతాదుకు మించి యాంటిబయోటిక్స్ వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యలు చిన్నవి కావు.. ఇవి నేరుగా రోగుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

## వైద్య పరికరాలకూ ముప్పు

అత్యవసర విభాగం, ఐసీయూ వంటి ప్రాణభద్రతకు కీలకమైన విభాగాల్లో ఏసీలు పనిచేయకపోవడంతో వైద్య పరికరాలు వేడి ప్రభావానికి లోనవుతున్నాయి. 1000 పైగా పరికరాల్లో 525 యూనిట్లు పని చేయడం లేదంటే, అది ఎలాంటి చికిత్సా వైఫల్యానికి దారి తీస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఈ సమస్యలు ఒక్కసారిగా రాలేదు. ఆసుపత్రిలో ఏసీల స్థితిపై నెలవారీ మానిటరింగ్, మెయింటెనెన్స్ చెయ్యాల్సిన వైద్యాధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పాత ఏసీలను రీప్లేస్ చేయాలన్న ప్రణాళిక లేదు. మరమ్మతులకు సరైన బడ్జెట్ కేటాయింపులేమీ కనిపించడంలేదు. వాస్తవంగా ఇది సాంకేతిక సమస్య కంటే, పరిపాలనా వైఫల్యానికి నిదర్శం. కొంతమంది రోగుల కుటుంబ సభ్యులు తమ ఇంటి నుండి చిన్న ఫ్యాన్లు తీసుకొచ్చి ఆన్ చేసుకోవడం చూసి సిబ్బంది కూడా మౌనంగా ఉండిపోతున్నారు. ఆసుపత్రిలో ఉన్న ఏసీలు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని రీప్లేస్ చేయడానికి ఇక్కడ సరైన ప్రణాళిక లేదు. రిపేర్ చేయాల్సి ఉన్నా సదరు అధికారులు పట్టించుకోవడం లేదు. పనిచేయని 68 ఏసీలను తక్షణమే మరమ్మతు చేయాలని, 130 పాత ఏసీలకు రీప్లేస్‌మెంట్ ప్రణాళిక రూపొందించాలని, శీతలీకరణ లేని వార్డులకు తాత్కాలికంగా ఇండస్ట్రియల్ ప్యాడ్/ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేయాలని, వైద్య పరికరాలకు ప్రత్యేక వేడి రక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రతి నెలా మానిటరింగ్ అండ్ మెయింటెనెన్స్ రిపోర్ట్ తప్పనిసరిగా తయారుచేయాలని పలువురు కోరుతున్నారు.

* రిమ్స్‌లో.. నరకయాతన!
* ప్రత్యేక వార్డుల్లోనూ పనిచేయని ఏసీలు
* ఉక్కపోత, వేడితో ఊపిరాడని రోగులు
* రోగులతో పాటు వైద్యులకు తప్పని పాట్లు
* మరమ్మతులకు గురైన 68 ఏసీలు
* వేడికి పనిచేయని లక్షలాదిరూపాయల వైద్య యంత్రాలు
* నిర్లక్ష్యంగా ఉంటే వైద్య పరికరాలకు ముప్పు
* సంబంధిత అధికారుల అలసత్వం
* చర్యలు చేపట్టడంలో రిమ్స్ ఉన్నతాధికారులు వైఫల్యం

# అవాస్తవాలు ప్రచారం చేస్తే చర్యలు





* కూర్మ ఘటనపై దర్యాప్తు చేస్తున్నాం
* ప్రమాద ఘటనలో ఎటువంటి దురుద్దేశం లేదు
* దీపం మంట తగిలి కాలిపోయివుండొచ్చు
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

**శ్రీకాకుళం క్రైం, జూన్ 14(వార్త):** ఆధ్యాత్మిక కేంద్రం కూర్మ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఎటువంటి దురుద్దేశం లేదని, అవాస్తవాలు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ అగ్నిప్రమాద ఘటనలో వ్యక్తిగతంగా, అల్లరి మూకలు ప్రమేయం లేదని గుర్తించామన్నారు. కూర్మ గ్రామ సభ్యులు ప్రతిరోజు దీపాలు వెలిగించి పూజ చేసుకున్న అనంతరం దీపాలు ఆర్పి వేసి వెళ్లి పోతారని, ఏదైనా దీపం పొరపాటున పూర్తిగా ఆగకపోయి ఉన్నట్లయితే దాని వలన ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రస్తుతానికి భావిస్తున్నామన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే ప్రమాద స్థలంలో భౌతిక ఆధారాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్ విజయవాడనకు పరీక్షలు నిమిత్తం పంపించడం జరిగిందన్నారు. సాంకేతిక ఆధారాలు బట్టి అన్ని కోణాల్లో ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. అవాస్తవాలు వదంతులు ప్రజలు ఎవరూ నమ్మవద్దని ఎస్పీ సూచించారు.

## ఘటన దురదృష్టకరం: పవన్ కల్యాణ్

శ్రీకాకుళం జిల్లాలోని కూర్మ గ్రామంలోని ఆధ్యాత్మిక మందిరంలో అగ్నిప్రమాదం దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అది ఆధునిక హంగులు లేకుండా ఆధ్యాత్మిక చింతనతో జీవించే గ్రామమని తెలిపారు. మూడు రోజుల క్రితం ఆధ్యాత్మిక మందిరంలో అగ్ని ప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. మంటల ధాటికి భక్తులు పరుగులు తీశారు. ఈ ఘటనలో విలువైన గ్రంథాలు దగ్ధమయ్యాయి. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టాలని, అనుమానాలు ఉన్న దృష్ట్యా అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలన్నారు. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైందని చెప్పారు. యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్లలో ఉంటున్నారని, ఈ గ్రామ పునరుద్ధరణపై దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ కోరారు.

## కూర్మ గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఎంజీఆర్

**హిరమండలం:** కూర్మ గ్రామాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం సందర్శిం చారు. ప్రమాదం జరిగిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. కూర్మ గ్రామ నిర్వాహకులు ప్రభుదాస్‌తో మాట్లాడారు. కూర్మ గ్రామంలో ఘటన విచారకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. కూర్మ గ్రామ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సాంస్కృతిక, సంప్రదా యాలకు కూర్మ గ్రామం చిరునామా అని తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ ఎన్.హనుమంతరావు, ఎంపీడీఓ రఘుపాత్రుని కాళీప్రసాద్, ఎస్.ఐ ఎండి.యాసీన్, మండల విస్తరణాధికారి గోవిందరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు, విద్యావేత్త తూలుగు తిరుపతిరావు మాస్టారు ఉన్నారు.


లేడీ డాక్టర్‌ను బెదిరించి.. రూ.13.50 లక్షలు దోపిడీ
4లో

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జాతీయస్థాయి ఐస్ స్కేటింగ్ పోటీలకు తోషిని




**పలాస, జూన్ 14(వార్త):** ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్ జిల్లాలో ఈ నెల తేదీ 18 నుంచి జరగనున్న జాతీయస్థాయి ఐస్ స్కేటింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు పలాసకు చెందిన గోపీచంద్ స్కేటింగ్ క్లబ్ క్రీడాకరిణి జక్కల తోషిని రాయ్ ఎంపికయ్యారని ఆంధ్రప్రదేశ్ ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మురళి, కార్యదర్శి ఎం.కాజా తెలిపారు. స్కేటింగ్ కోచ్ బి.చంద్రావతి, క్లబ్ సభ్యులు పలువురు ఆ చిన్నారిని అభినందించారు.



**-జేసీఐ ఆధ్వర్యంలో ..**

**ఇచ్ఛాపురం, జూన్ 14(వార్త):** జేసీఐ ఆధ్వర్యంలో, గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి(శ్రీకాకుళం) సౌజన్యంతో ఇచ్ఛాపురంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 52 రక్త యూనిట్స్ సేకరించారు. ఈ సందర్భంగా 191 సార్లు రక్తదానం చేసిన బొడ్డేపల్లి శ్రీనివాస్‌ని సన్మానించారు. ఇది దేశవ్యాప్తంగా ఒక రికార్డ్ అని జేసీఐ అధ్యక్షుడు కాళ్ల జైదేవ్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన జేసీఐ సభ్యులకు, శ్రీకాకుళం ఆసుపత్రి బృందానికి, రక్తదాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో సెక్రటరీ డా.మోహన్ వెంకటేష్, ప్రాజెక్ట్ చైర్మన్ డా.వెచ్చ సంతోష్, జోన్ అధికారి తంగుడు షణ్ముక్ సంతోష్ సాహూ, దిల్లేసు, మట్టా శ్రీనివాసరావు, వెచ్చ రాము, వెచ్చ వాసవి, పవన్, మల్లేశ్, రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.

**-ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో...**

**పలాస, జూన్ 14(వార్త):** రక్తదానానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పలాస క్యాష్యు లేబర్, రైస్ మిల్లర్స్ కార్మికుల భవనం వద్ద ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణం పోస్తుందన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం ఎంతో ఆనందకరమన్నారు. ఆ నలుగురు ట్రస్ట్ ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 20 మంది రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు.

కార్యక్రమంలో సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వర రావు, రాజు, నరేష్, మన్మధ, వేణు, క్యాషు లేబర్ యూని యన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, సింహాచలం, రాము, నాగేశ్వరరావు, మోహన్, ప్రాణదాత బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.




# రక్తదానం చేయండి..ప్రాణదాతలు కండి

**-ఘనంగా రక్తదాన దినోత్సవం**

**-మనిషి ప్రాణానికి రక్తం ఎంతో అవసరం**

**-జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత**

**శ్రీకాకుళం, జూన్ 14(వార్త):** మనిషి ప్రాణానికి రక్తం ఎంతో అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత వెల్లడించారు. శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రిమ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి శరీరంలో సుమారు ఆరు లీటర్ల రక్తం ఉంటూ నిరంతర శరీరంలోని వివిధ భాగాలు చేరుతుందన్నారు. రక్తకణాల వయసు 120 రోజులు మాత్రమే ఉంటుందన్నారు. 120 రోజులు తర్వాతకమేణా రక్త కణాలు నశించిన తర్వాత కొత్త రక్త కణాలు ఎముక మజ్జి నుండి పుట్టుకొస్తాయని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియని చెప్పారు. రక్త దానం చేయడం వలన మరొక వ్యక్తి ప్రాణం నిలబడుతుందన్నారు. పెద్ద పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం పోతుందని, రక్తం పోయిన తర్వాత మనిషి ప్రాణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అలాంటి సమయంలో రక్తం అందించాలన్నారు. జిల్లాలో 6 రక్త సేకరణ కేంద్రాలు ఉన్నాయని వీటి ద్వారా రక్త సేకరణ జరుగుతుందన్నారు. ప్రమాదాలు జరిగిన వ్యక్తులకే కాకుండా సికిల్ సెల్, తలసేమియా తదితరులకు రక్తం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం దానం చేయాలని పిలుపునిచ్చారు. అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీకాంత్, ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ డీ.పార్వతి తదితరులు



మాట్లాడారు. ఆసుపత్రి పరిపాలనాధికారి డాక్టర్ బి.రాజశేఖర్ రెడ్డి, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.సునీత, ఎన్.సి.సి. కెప్టెన్ మహేష్ పాల్గొన్నారు.



**ఖజానా శాఖా ఉద్యోగులు..**

**శ్రీకాకుళం, జూన్ 14(వార్త):** ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్రెజరీ డిపార్ట్మెంట్ ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించబడింది. రక్తదానం చేసిన వారిలో ట్రెజరి ఉద్యోగులు డేవిడ్ మాదారపు, బి.ప్రదీప్ కుమార్, బి.గాంధీ, కే.వరప్రసాద్, ఎస్.సూర్య చంద్ర, కే.సతీష్ చంద్ర, టీ. అనిల్ , సీహెచ్. సంతోష్, ఎన్. ఈశ్వరరావు, బి.సాయికృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరి ఉద్యోగులు డి.శ్రీరామ్ కుమార్, బి.శ్రీనివాస రావు, పి. చంద్రశేఖర్, సీహెచ్. చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. రెడ్ క్రాస్ సెక్రటరీ బలివాడ మలీశ్వరరావు మరియు రెడ్ క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్య కుమార్, పి. శ్రీకాంత్, గుణాకర్, నర్సింగ్ రావు పాల్గొన్నారు. రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే మహత్తరమైన కార్యమని వారు పేర్కొన్నారు.

# రైతన్నకు అండగా ప్రభుత్వం

**-విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు**

**-ఎమ్మెల్యే మామిడి గోవిందరావు**

**- ఎఫ్‌డీ పేటలో పలువురు వృద్ధులకు పండ్లు పంపిణీ**

**ఎల్ఎన్ పేట /హిరమండలం జూన్ 14(వార్త):** రైతన్నకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఎల్ఎన్ పేట మండలం, యంబరాం పంచాయతీ పరిధి, ఎఫ్‌డీ పేట గ్రామంలో ఇటీవల పలువురు రైతులు ఎఫ్‌డీ పేట నుంచి యంబరాం మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విన్న వించుకోగా





ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో పలువురు వృద్ధులకు, వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అండగా ఎల్లవేళలా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఏ ఒక్కరూ దిగులు చెందాల్సిన పనిలేదన్నారు.

కార్యక్రమంలో మాజీ జడ్పీ టీసీ వెలమల సుగుణ, సర్పంచ్ వెలమల గోవిందరావు, ఉప సర్పంచ్ పడాల చిట్టిబాబు, టిడిపి మండల యువనాయకులు అంపిలి పోలినాయుడు, వాన శ్రీనివాసరావు, పడాల శ్రీధర్, బోర సురేష్,పడాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఆర్మీ ఆఫీసర్‌గా మశాఖపురం వాసి

**ఇచ్ఛాపురం, జూన్ 14(వార్త):** మశాఖపురం గ్రామానికి చెందిన ఆశి సంతోష్ కుమార్ రెడ్డి లెఫ్టినెంట్ ఆర్మీ ఆఫీసర్‌గా కొత్తగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భముగా జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిప్పన దుర్యోధన ఎబిషేత్రష్ణ, స్నేహితులు సంతోష్ రంగా, ప్రతాప్, రేణుబాబు, తారకేసు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.



# విశాఖలో ‘యోగాంధ్ర’కు సన్నద్ధం

**-కలెక్టర్ స్వప్నీల్ దినకర్ పుండ్కర్ పిలుపు**
**-శ్రీకాకుళంలో ఘనంగా మాక్ యోగా**

**శ్రీకాకుళం, జూన్ 14(వార్త):** “యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నీల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ఈనెల 21న జరగనున్న రాష్ట్ర స్థాయి ‘యోగాంధ్ర’ కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, విద్యార్థులు, అధికారులు పాల్గొనాలన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని 80 అడుగుల రోడ్డులో మాక్ యోగా కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సమిష్టిగా కృషి చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన యోగా సదస్సులో కామన్ యోగా ప్రొటోకాల్‌కు అనుగుణంగా విన్యాసాలు నిర్వహించారు. అధికారులు తాగునీరు, ప్రథమ చికిత్స, టీ–షర్టులు, యోగా మ్యాట్స్, వేదిక ఏర్పాటు వంటి ఏర్పాట్లను సమర్ధవంతంగా చేపట్టారు. అన్ని శాఖల అధికారులు, పాఠశాలలు, శిక్షణ నిపుణులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు బృందాలుగా భాగస్వామ్యమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని 80 అడుగుల రోడ్డును ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ యోగా, మెంటల్ ఫిట్‌నెస్, స్కేటింగ్ వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలకు కేటాయించాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికీ యోగా ప్రారంభించని వారు యూట్యూబ్‌లో కామన్ యోగా ప్రోటోకాల్‌ను చూసి సాధన మొదలుపెట్టవచ్చునని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగ సాధనలో భాగస్వాములై తమ ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మాక్ యోగా కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బీ.శాంతిశ్రీ, టూరిజం అధికారి నారాయణరావు, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, డిపిఓ భారతీ సౌజన్య, శ్రీకాకుళం ఆర్డిఓ సాయి ప్రత్యూష, ఐసిడిఎస్ పిడి శాంతిశ్రీ, డిఆర్డిఏ పిడి కిరణ్‌కుమార్, జిల్లా అధికారి నారాయణరావు, శ్రీకాకుళం తహసిల్దార్ గణపతిరావు, డిఎస్డివో శ్రీధర్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి సాయికుమార్, ఆయుష్ అధికారి డా.పి.జగదీష్, డా.ఉత్తమ్ రాజ్ రాణా, జె.శేఖరరావు, యోగా గురువులు తంగి స్వాతి, కొంక్యాణ మురళీ, మురళి, గాయత్రి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు చెందిన సుధా రాణి, కల్పన, పతంజలి ప్రతినిధి డి.చినబాబు తదితరులు పాల్గొన్నారు.





**శాంతినికేతన్ స్కూల్‌లో**

**ఇచ్ఛాపురం, జూన్ 14(వార్త):** శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం మండల విద్యాశాఖాధికారి సూచనలు మేరకు యోగా ఆసనాలు వేశారు. స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులతో వేయించారు. స్కూల్ చైర్మన్ కృష్ణమూర్తి రెడ్డి మాట్లాడుతూ యోగాతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మనిషి హుందాగా ఉంటారన్నారు. ఏకాగ్రత కలిగి బాగా చదువుకుంటారన్నారు. కార్యక్రమంలో మేనేజర్ కె.సి. పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, యశోద, శాంతి, యశోద, మీనా, జయలక్ష్మి, సరోజినీ పాల్గొన్నారు.

**-జ్ఞానభారతిలో ..**

**ఇచ్ఛాపురం, జూన్ 14(వార్త):** జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో విద్యాశాఖ ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులతో సామూహిక యోగాభ్యాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు వారితో పలు ప్రాణాయామ ప్రక్రియలు, పలు యోగాసనాలు అభ్యసన చేయించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ట్రస్టీ వజ్రపు రమణమూర్తి,పాఠశాల ప్రిన్సిపాల్ ఐ బి పండా ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ , వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ కుమార్ పండా, డి రామచంద్ర పాల్గొన్నారు.





**-బొడ్డపాడులో ..**

**పలాస, జూన్ 14(వార్త):** బొడ్డపాడు గ్రామ పంచాయతీలో సచివాలయం సిబ్బంది “యోగాంధ్ర” మహోత్సవం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పలాస మండల హార్టీ కల్చర్ ఆఫీసర్ చీడిపల్లి శంకర్ దాస్, బొడ్డపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎన్‌డీఏ కూటమి పెద్దలు, ప్రజలు,గ్రామ పెద్దలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**యోగాతో మానసిక ఉల్లాసం : ఎంపీడీవో వసంతకుమార్**

**పలాస, జూన్ 14(వార్త):** యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతోందని పలాస ఎంపీడీవో వసంతకుమార్, ఆయుష్ వైద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం పలాస మండలం రెంటికోట సచివాలయం ఆవరణలో యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం వేద భూమి అని, ప్రాచీన కాలం నుండి యోగ ప్రాచుర్యం పొందిందన్నారు. యోగతో శరీరంలో ఉన్న అన్ని రుగ్మతలు తొలగిపోతాయని ప్రతి ఒక్కరూ గంట పాటు యోగ చేయాలని సూచించారు. యోగాతో మానసిక, శారీరక ఒత్తిళ్లను జయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుండి యోగాభ్యాసాన్ని అలవాటుగా మార్చుకొని నిరంతర సాధన చేయాలని అన్నారు. నేటి జీవన విధానంలో నిత్యం అధిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నామని, తద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. ఇటువంటి తరుణంలో యోగా చక్కని పరిష్కారమని చెప్పారు. యోగా వల్ల నూతనోత్తేజం లభిస్తుందని, దీనివల్ల మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం వీరితో పాటు అధికారులు యోగాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి వైకుంఠ రావు, రెంటికోట పంచాయతీ కార్యదర్శి సద్గుణబాబు, సచివాలయ సిబ్బంది, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కూలీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






**లావేరు నుంచి 8 వేల మందితో**
**విశాఖ యోగా సంగమం వైపు!**

**లావేరు, జూన్ 14(వార్త):** విశాఖపట్నంలో ఈ నెల 21న ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు దిశానిర్దేశం చేశారు. విశాఖ యోగా సంగమానికి సంబంధించి లావేరు మండలంలో నిర్వహించిన సన్నాహక సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశం లావేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షతన నిర్వహించగా, ఇందులో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యోగా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ, “లావేరు మండలం నుంచి కనీసం 8 వేల మందిని విశాఖ యోగా కార్యక్రమానికి తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. ప్రతి గ్రామం నుంచి ప్రజల భాగస్వామ్యం నిర్ధా రించాలి,” అని ఆదేశించారు. సమావేశంలో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొని తమ సూచనలు, సన్నాహక చర్యల వివరాలు వెల్లడించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రత్తకన్నలో విత్తనాల పంపిణీ



**ఇచ్ఛాపురం, జూన్ 14(వార్త):** రత్తకన్నలో శనివారం నీటి సంఘం అధ్యక్షులు బుగత జగన్ అధ్వరంలో విత్తనాలు పంపిణీ చేశారు. తొలిరోజు 100 బస్తాలు అందజేశారు. మరో100బస్తాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సుభాష్ రౌలో, గ్రామ పెద్దలు గిన్నె లక్ష్మీనారాయణ దుర్గాసి పిల్లయ్య, దుర్గసి జోగయ్య, చంద్రయ్య, లాది సోమయ్య తదితరులు పాల్గొన్నారు.





# బెల్ట్ తియ్యరా?

* యథేచ్ఛగా అమ్మకాలు
* గ్రామాల్లో బెల్ట్ షాపులకు వేలం పాటలు
* గ్రామాల్లో మద్యం కిక్
* నెలసరి ముడుపులతో ఎక్సైజ్, పోలీసుల మౌనం

**సంతబొమ్మాళి, జూన్ 14 (వార్త):** సంతబొమ్మాళి మండలంలో ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. లైసెన్సు వైన్ షాపుల ద్వారానే బెల్టు షాపులకు సరుకు రవాణా కావడంతో ఈ బెల్ట్ రాకెట్ మూడు గ్లాసులు ఆరు సీసాలుగా సాగుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. మండలంలో ఐదు లైసెన్స్ వైన్ షాపులు ఉంటే మండలంలో వందలకు పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నట్లు తెలుస్తోంది. బెల్ట్ షాపు వారు సీసాపై ఎమ్మార్పీ రేటు కంటే రూ.50 అదనంగా వేసి సొమ్ము చేసుకుంటున్నట్లు మందుబాబులు ఆరోపిస్తున్నారు. అయితే వైన్ షాపు వద్ద ఒక వ్యక్తికి మూడు సీసాలకు మించి ఇవ్వరాదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ వందల సంఖ్యలో బెల్ట్ నడిపే వారికి మందు బాటిళ్లు వైన్ షాపు వారే సరఫరా చేయడం విశేషం. అది కూడా బెల్టు షాపు వారికి వైన్ షాప్ వారు పది రూపాయలు అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారని బహిరంగ విమర్శలు ఉన్నాయి. మండలంలో ఇంత పెద్ద ఎత్తున ఈ బెల్ట్ షాపులు అమ్మకాలు జరుగుతుంటే అటు ఎక్సైజ్ వారు గానీ ఇటు పోలీసులు గానీ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మండలంలో ప్రతి గ్రామంలో ఎవరెవరు ఈ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు, వారికి ఏ లైసెన్సు వైన్ షాపు వారు సహకరిస్తున్నారన్న పూర్తి వివరాలు పోలీసులకు ఎక్సైజ్ శాఖకు తెలిసినప్పటికీ ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కాని ప్రశ్నగా మారిందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నెలసరి ముడుపులు అందడంతోనే ఈ మౌనం అంటూ పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, అధికార పార్టీ నాయకులు ఇలాగే మౌనం వహిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు కలలు కన్న ఆశయాలు బూడిదలో పోసిన పన్నీరే అవుతాయని గ్రహించాలి. ఇప్పటికైనా బెల్టు షాపులపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


### పలు గ్రామాల్లో బెల్టు షాప్‌లకు వేలం పాట ..

మండలంలో ఇప్పటికీ పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల కోసం లక్షల్లో వేలం పాటలు నిర్వహించి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. గ్రామాల అభివృద్ధి పేరుతో లైసెన్స్ షాపు యజమానులే గ్రామాల్లో వేలం పాటలు పంచాయతీ ద్వారా నిర్వహిస్తున్నారని బహిరంగ విమర్శలు ఉన్నాయి. మండలంలో ఐదు లైసెన్స్ మద్యం షాపులు పరిధిలో ఇప్పటికే చాలా గ్రామాల్లో ఈ వేలం పాట నిర్వహించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ కూడా జరుగుతుంది. అనధికారంగా పంచాయతీలకు డబ్బులు కడుతున్నారని వినికిడి. బెల్ట్ షాపు కోసం వేలంపాటలో పాడిన వ్యక్తికి గ్రామాల్లో ప్రతి మద్యం బాటిల్ పై రూ. 20 నుంచి 50 వరకు అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నట్లు మందు బాబుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే బెల్టు షాపు కోసం వేలంపాట వేసిన గ్రామాలకు ఎక్సైజ్, పోలీస్ అధికారులు వచ్చి తీసుకోవాల్సినవి తీసుకొని వెళ్ళిపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ఒక గ్రామాన్ని చూసి మరో గ్రామం బెల్టు షాపుల కోసం వేలంపాటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ అధికారులు ఒక పక్క చెబుతూ మరోపక్క గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క దాడులు చేస్తామని అంటూ మరోపక్క షాపు యజమానుల ద్వారా బెల్ట్ షాపులు నిర్వహించడం చూస్తే ఆశ్చర్యం కలిగిస్తుందని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మండలంలో పుట్టగొడుగుల్లా వెలసిన బెల్ట్ షాపులపై ప్రభుత్వం చెబుతున్నట్లు సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### బెల్ట్ షాపులు మూసివేతకు చర్యలు చేపడుతున్నాము

కోటబొమ్మాళి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు లేకుండా చర్యలు చేపడుతున్నాము. తీర ప్రాంతాల్లో, గ్రామాల్లో బెల్టు షాపులు కొనసాగుతున్నాయని ఫిర్యాదులు వస్తుంటే వాటిపై నిఘా పెంచాము. మా టీములు అపరిమితంగా ఉన్నాయి. ఎవరికైనా సమాచారం ఉంటే పక్కా రుజువులతో మమ్మల్ని సంప్రదిస్తే తక్షణ చర్యలు తీసుకుంటాము. బెల్టు షాపులు పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు, అలాగే సంబంధిత వైన్ షాప్ లైసెన్స్ రద్దు చేస్తాము.

**– గాయత్రి, ఎక్సైజ్ సీఐ, కోటబొమ్మాళి**



### లేడీ డాక్టర్‌ను బెదిరించి..

## రూ.13.50లక్షలు దోపిడీ

* ముఠాను అరెస్టు చేసిన పోలీసులు
* ఆరులక్షలు నగదు స్వాధీనం
* వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద



**శ్రీకాకుళం క్రైం, జూన్ 14(వార్త):** డిజిటల్ అరెస్టు పేరిట సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నేరస్థులు ఒకటో పట్టణ పోలీసులు పట్టుకుని వారి నుంచి రూ.6లక్షలు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జెమ్స్ మెడికల్ కాలేజ్‌లో పనిచేస్తున్న డాక్టర్ రేవతికి గత నెల 14న ఉదయం 10 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. బెంగుళూరు అశోక్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి సైబర్ నేరగాళ్లు రేవతిని బెదిరించారు. హ్యూమన్ ట్రాకింగ్ చేయించే కేసులో మీ పేరు ఉందంటూ.. సీబీఐ కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు. కేసు విషయంలో సుప్రీంకోర్టులో వాదించేందుకు కొంత డబ్బును డిపాజిట్ చేయాలని, అంతవరకు మీ అరెస్టు ఆగుతుందని చెప్పారు. దీంతో భయపడిన వైద్యురాలు వారు చెప్పిన పలు అకౌంట్లకు రూ.13.50లక్షలు ఆన్‌లైన్‌లో జమ చేశారు. ఆ తర్వాత ఆమె ఈవిషయమై శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు సైబర్ నేరగాళ్లను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ముద్దాయిలు మైసూర్‌కు చెందిన రుమన్ షరీఫ్, కాలికట్‌కు చెందిన నౌఫాలా షరీన్, కేరళకు చెందిన నిజాముద్దీన్ చక్లాలుగా గుర్తించారు. ఆ ముగ్గురినీ విచారించారు. వారి వద్ద నుంచి సుమారు రూ.6లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును చేధించడంలో కృషి చేసిన శ్రీకాకుళం రూరల్ సీఐ కె.పైడిపునాయుడు, ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ, ఎస్ఐ రాజేష్, కానిస్టేబుల్ ఈశ్వరరావు, రమణ, ధనలక్ష్మీని డీఎస్పీ అభినందించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546